ఎదురు చూస్తున్నాడు యమభటులు శక్తేశ్వర్‌ని తీసుకెళ్ళి మరో వ్యక్తిని ప్రవేశపెట్టారు

"నీ పేరు?" అడిగాడు చిత్రగుప్తుడు కొద్ధిగా ఆశ్చర్యంగా.

"బృహస్పతి"

చిత్రగుప్తుడు చిట్టాతిరగేసి "నీవు ఇంకా ముప్పై రెండేళ్ళ బ్రతకాలి ఎలావచ్చావ్?" అడిగాడు.

"శక్తేశ్వర్ వెంట వచ్చాను"

"శక్తేశ్వర్ చొక్కాగుండీలు పెట్టుకుంటూ నడుస్తుంటే నెత్తి మీద చెక్కపెట్టె పడి మరణించి రావాలని రాసివుంది. నువ్వు గుండె జబ్బుతో మరణించాలి. ఇదెలా సంభవం?" అడిగాడు చిత్రగుప్తుడు ఆలోచనగా. "నేనా చెక్కపెట్టెలో వున్నాను" చెప్పాడు బృహస్పతి. జరిగిన పొరపాటుని సరిదిద్దుకున్నారు యమభటులు.

* * * *

హాస్పిటల్‌లో బృహస్పతికి తెలివొచ్చింది. శివనాథ్ భార్యనుచూసి బలహీనంగా నవ్వి చెప్పాడు.

"త్వరలో మీ ఆయన్ని వురితీయటం జరుగుతుంది."

"నీ కెలా తెలుసు?" అడిగింది ఆమె.

"స్వయాన చిత్రగుప్తుడే చెప్పాడు" బృహస్పతి సంతోషంగా నవ్వుతూ చెప్పాడు.

# తెలివయిన భార్య

నాతో పాటే వాళ్ళు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో, అదే కంపార్ట్‌మెంట్‌లో వచ్చారు. ఆమె వయస్సు ముప్పై-ముప్పై రెండు మధ్య వుంటుంది. చూడగానే "చక్కని గృహిణి" అనే భావం కలిగేలా వుంది.

ఆమె భర్త ఆమె కన్నా నాలుగైదేళ్ళు పెద్ద. జోవియల్‌గా వున్నాడు. మళయాళంలో మాట్లాడుకుంటున్నారు. నాతో పాటే కాజీపేటలో దిగారు నేను సరాసరి ఎంక్వయిరీకెళ్ళి, కాజీపేటనించి అలహాబాద్‌కి నేను చేయించుకున్న అన్‌వర్డ్ రిజర్వేషన్ కన్‌ఫం అయిందో అడిగి తెలుసుకున్నాను. ఆయన కూడా తమ టిక్కెట్ నెంబర్లు, పేర్లు చెప్పి కన్‌ఫం అయిందో లేదో కనుక్కున్నారు కాశీకి వెళుతున్నారు ఇద్దరు అంటే మళ్ళీ నాతో పాటే గంగా-కావేరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తారన్న మాట. ఆ బండి రావడానికి ఇంకా రెండు గంటల టైముంది.

అయిదు నిమిషాలయ్యాక ఆయన ఆమెని ఏదో ప్రాధేయ పడుతూ అడుగుతున్నాడు. ఆమె ససేమిరా అంటోంది. పెట్లోంచి జేమ్స్ హాడ్లీచేజ్ నవల తీసిచ్చి చదువుతూ కూర్చొంది. ఆయన నాలుగు పేజీలు తిరగేసి దాన్ని మూసి మళ్ళీ ఆమెని బ్రతిమాలసాగాడు.

ఆ భాష రాదు కాబట్టి నాకు ఆయన ఏం అడుగు తున్నాడో నా కర్థం కాలేదు. ఆయిదారు నిమిషాలపాటు ఆవిడ ఆయన్ని అడిగేదానికి ఒప్పకోకుండా బింకంగా కూర్చుంది. ఆయన ప్రాధేయపడటం అధికం అవుతోంది. మాటిమాటికి టైం చూసుకుంటున్నాడు ఆమె ఆయనికి ఏదో చెప్పి లేచి బయటకు వెళ్ళింది. అయిదు నిమిషాల్లో నవ్వుతూ వచ్చింది. ఆయన చేతిలో ఏదో పెట్టి వెళ్ళచ్చన్నట్టుగా సౌజ్ఞ చేసింది. తన చేతిలోని వస్తువు చూసి ఆయనకు కోపం వచ్చిందని గ్రహించాను. ఆదేమిటో వూహించ లేక పోయాను.

ఆయన విసురుగా బయటకి నడిచాడు. నేను ఆసక్తిగా ఆయన్ని వెంబడించాను. రిజర్వేషన్ కేన్సిలేషన్ ఫారం అందుకుని ఆయన దాన్ని నింపి, తన చేతిలోని టికట్‌తో మద్రాస్ వైపు టికెట్స్ అమ్మే కౌంటర్ లోని క్యూలో నిలబడ్డాడు

పావుగంట తర్వాత "రిఫండ్స్" అని రాసున్న కౌంటర్ దగ్గరకి వెళ్ళాడు. దాదాపు అరగంటదాకా ఆయన ఆ కౌంటర్ దగ్గరనిలబడ్డాను.

చివరికి డబ్బువాపస్ తీసుకుని చేతిగడియారం వంక చూచుకొని ప్లాట్ ఫాం మీదకి వెళ్ళాడు. ఆయన ఆమెకి దూరంగా పెట్టెని జరుపుకుని కోపంగా కూర్చున్నాడు. ఆమె ఆయన్ని పలకరించే ప్రయత్నం చేయ లేదు

పదినిమిషాల్లో మా బండి వచ్చింది. రైలు బయలుదేరాక ఏం జరిగి వుంటుందాని ఆలోచించాను. కాని నాకు అర్థం కాలేదు. బాత్రూంకి వెళ్ళు తుంటే మళ్ళీ వాళ్ళిద్దరూ నాకు తారసపడ్డారు. నా ప్రక్క కేబిన్‌లోనే వాళ్ళున్నది. బాత్ రూం నించి తిరిగి వస్తూంటే ఆయన బయట కారిడార్‌లో నిలబడి సిగరెట్ తాగుతూండటం చూసాను.

కొద్దిగా సందేహించినా ధైర్యంచేసి అడిగాను ఇంగ్లీష్‌లో.

"క్షమించండి ఇందాక మీరు మీ ఆవిడని బతిమాలింది ఆ టిక్కెట్ కేన్సిల్ చేయాలనా!"

ఆయన నన్ను ఎగాదిగాచూసి అడిగాడు.

"మీకెలా తెలుసు?"

నేను గమనించిందంతా ఆయనకి వివరించి చెప్పాను. "నా ఆసక్తి చంపుకోలేక ఇలా అడుగుతున్నందుకు మన్నించండి."

చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఈ రైలుకి టైముందికాబట్టి కాజీపేట స్టేషన్‌కి పర్లాంగుదూరంలో వున్న బార్‌కి వెళ్ళి ఓ బీర్ తాగొస్తానని కోరాను. మా ఆవిడ ఒప్పుకో లేదు. తీరా ఆవిడ పర్మిషన్ లేకుండానే నేను వెళతాననే భయంతో మద్రా స్‌కి వారం రోజుల తర్వాతకి ఓ టిక్కెట్ రిజర్వుచేసి తెచ్చిందని దాన్ని కేన్సిల్‌చేసి తర్వాత బార్‌కెళ్ళి రమ్మంది."

చిన్నగా నిట్టూర్పు పూరించేశాడు. చూస్తూ చూస్తూ డబ్బు పోగొట్టుకోలేంకదా. అది కేన్సిల్ చేసేసరికి బార్‌కి వెళ్ళొచ్చే వ్యవధి లేకపోయింది.

"మీ ఆవిడ తెలివైంది" మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

"నిజం. ఒక్క ఆదివారం తప్ప మిగతారోజుల్లో ఆవిడ అనుమతి లేకుండా తాగకూడదని మామధ్య ఒప్పందం వుంది."

మర్నాడు వుదయం నిద్రలేచాక బయటకి వస్తే ఆవిడ కనబడి నవ్వి నాతో చెప్పింది.

"నిన్న జరిగింది మీకు తెలిసిందటగా?"

తలవూపి నవ్వాను.

"ఆయనకి తెలియనిది, మీకు మాత్రం తెలిసే ఓ రహస్యంచెప్పనా? రిఫండ్స్ కౌంటర్‌లోని క్లర్క్‌కి అయిదు రూపాయలు లంచం ఇచ్చి, డబ్బు తిరిగి ఇవ్వటం ఆలస్యం చేయమని కోరాను. లేకపోతే ఎందుకండి ఆయన అనవసరంగా ఆరోగ్యం పాడుచేసకోవడం? టిక్కెట్ కేన్సిలేషన్‌కి అయిదారు రూపాయలు ఖర్చయినా నే చేసింది మంచి పని కాదంటారా?" ప్రశ్నించింది.

# భయంకరమైన రోజు

రెండు రోజులనుంచి వెదుకుతూంది అనూరాధ తన బాంక్ పాస్ బుక్ కోసం. తన టేబుల్‌లోని డ్రాయర్లన్నీ వెదికింది. ఇనుప బీరువా మొత్తం వెదికింది. తను రిఫరెన్సుకోసం కొన్ని పుస్తకాల రేక్‌లో వెదికింది. డ్రాయింగ్ హాలులో వెదికింది. డైనింగు హాలులో వెదికింది. వంట గదిలోనేకాదు, చివరికి బాత్ రూమ్‌లో కూడా వెదికింది.

బాంక్ పాస్‌బుక్ ఆవిడకు కనబడలేదు. బాంకులోనుంచి డబ్బు తీయడానికి కాదు దానికోసం వెదికేది చెక్ సౌకర్యం వుండడవల్ల పాస్ బుక్కు లేకపోయినా ఫర్వాలేదు.